ప్రపంచంలో నా అనేవారు లేరు—అన్నభావం ఎంతటి వారిని అయినా క్రుంగ దీస్తుంది. ఎట్టకేలకు జీవితంలో ఒక్కసారి ఇదినాది, ఇంతకన్న కావలసినది లేదు–అనుకొన్న తరువాత మరలఅంధకారమే ప్రాప్తిస్తుంది, ఒకొక్కనిర్భాగ్యునికి. అది ప్రపంచానికీ అంధకార సదృశం కావాలా?




ఎస్ వి సత్యనారాయణమూర్తి

ప్రభాత కాంతి అప్పుడే కొద్దికొద్దిగా ప్రకృతిమీద అలముకొంటూంది. అక్కడక్కడ చీకటిఛాయలుపోదామా, వద్దా అని తటపటాయిస్తున్నాయి. ప్రకృతి అంతా ఆహ్లాదకరంగా ప్రశాంతంగా ఉంది. చల్లని పిల్లగాలులు మెల్లగా




చలవచేసి
హాయి నిచ్చును

ఈ పరిమళ ఆయుర్వేద హెర్ అయిల్ (తలనూనె) – బెంగాల్ కెమికల్స్‌వారి పెర్‌ఫ్యూమ్డ్ బ్రాహ్మి హెర్ అయిల్. శిరోజములు ఒత్తుగా పెరుగును. మెదడుకు చలవచేసి నరాలకు హాయి నిచ్చును. దీనిని నిత్యమూవాడిన మెదడుకు అలసట వుండదు. హాయిగా నిద్రపట్టును. ఎక్కువ మానసిక ప్రయాస, శ్రమగలవారికి ఎంతో మంచిది.




బెంగాల్ కెమికల్ వారి వస్తువు

NATIONAL-CAL-B-40TG

# త్యాగి

వీస్తున్నాయి. ప్రకృతికాంత వేసుకున్న సన్నటి మేలిముసుగులా ఉన్న మంచుతెర మెల్లగా జారిపోతూంది. దూరంగా ఒక నల్లని పర్వత శిఖరాన్ని తెల్లని మేఘం ఒకటి ఒరుసుకుంటూ వెళ్ళుతూంది. చిన్న సెలయేరొకటి గలగలమనే మర్మరధ్వనితో ప్రవహిస్తూంది. చక్కని ప్రకృతి సౌందర్యానికది ఒక మచ్చుతునక. ప్రపంచంలోని ప్రశాంతినంతా తెచ్చి అక్కడ కేంద్రీకరించినట్లుంది.

అకస్మాత్తుగా ఆ ప్రశాంతిని చీలుస్తూ......

"ఫైర్!"......

బ్రిగేడియర్ జనరల్ సురజిత్‌సింగ్ కంఠంతోబాటు నూటయెనభై స్టెన్‌గన్‌లు ఒకేసారి గర్జించాయి.

అక్కడున్న ప్రశాంతి రెక్కలు కట్టుకొని ఎగిరిపోయింది, అనువైన మరొక స్థలం వెతుక్కొనడానికి.

అది అస్సాం రైఫిల్సు డివిజనులో ఒక పటాలం. తిరుగుబాటుచేసిన నాగవిద్రోహులను తుదముట్టించడానికి దండయాత్ర సాగిస్తున్నది.

స్టెన్‌గన్‌లకు సమాధానంగా ఎదుటి పక్షం నుండి హేండ్ గ్రెనేడ్‌ల వర్షం కురిసింది.

ప్రాణానికి ప్రాణం.....దెబ్బకుదెబ్బ..... ఇదే రెండు పక్షాల ఆశయం.

మరుక్షణంలో ఆ ప్రదేశమంతా యుద్ధరంగంగా మారి బీభత్సమయింది. పచ్చని ప్రకృతి మందుగుండు ప్రేలుడుచే నల్లగా మారిపోయింది.

రైఫిల్సు డివిజను సైనికులు ముందుకు చొరుచుకొని వెళ్ళుతున్నారు. సురజిత్‌సింగ్ ఆజ్ఞలు జారీచేస్తూనే ఉన్నాడు. హఠాత్తుగా వెనుకనున్న సైనికుల్లో కలవరం బయలుదేరింది. సురజిత్‌సింగ్ వెనుకకు మరలి చూశాడు. నాగసైన్యం చక్రవ్యూహం పన్నుతూ రైఫిలు డివిజన్ సైన్యాన్ని చుట్టుముడుతూంది. సురజిత్‌సింగ్ రాబోయే ప్రమాదాన్ని గుర్తించాడు. సైన్యాన్ని వెనక్కు మరలమని ఆదేశాన్నిచ్చి మెరుపు మెరసినట్లు ఊచకోత కోసుకుంటూ నాగావ్యూహాన్ని ఛేదించి కొంత సైన్యంతో ముందుకు వెళ్ళిపోయాడు. ముందు రంగంలోనికి దిగిన అగ్రగామిదళం నాగవ్యూహంలో చిక్కుకుంది. నాగులు ఒక్కర్నీ పోనివ్వకుండా అందరినీ మట్టుబెడుతున్నారు.

దత్ కళ్ళు కనపడని పొగలో ఉక్కిరిబిక్కిరవుతూ, తనతుపాకి లక్ష్యంలేకుండా కాలుస్తున్నాడు. దత్ కళ్ళముందు పెద్ద మెరుపు మెరిసింది. కాళ్ళక్రింద భూమి బ్రద్దలై భూమిలో దిగబడిపోతూన్నట్లు దత్‌కు భ్రాంతి కలిగింది. మరుక్షణంలో అతడు స్పృహ కోల్పోయి నేలమీద పడిపోయాడు.

## 2

దత్ తల కదిలించాడు. భారంగా ఉంది. నీరసంగా కళ్లు విప్పిచూశాడు. ఆ ప్రదేశం తనకు పరిచితమైనది కాదు. చిన్నకుటీరంలా ఉంది. ఒకమూల పొయ్యిలో కట్టెలు మండుతున్నాయి. తనెక్కడున్నాడు? ఎవరు తీసుకు వచ్చారు? ఏమైంది? ఇలాటి ప్రశ్నలు కొన్ని వందలు దత్ మనస్సులో నిర్విరామంగా తిరుగుతున్నాయి. ఆలోచించినకొద్దీ తలనొప్పుతూఉంది. సమ్మెటతో కణతలమీద బాదుతున్నట్లుంది. అబ్బ! నిద్రన్నారాదే? పళ్లబిగిస్తూ, బాధను సహించలేక గట్టిగా మూల్గాడు దత్. కుటీరం తలుపు కీచుమంటూ తెరుచుకుంది. లోనికి ఒక వృద్ధుడు వచ్చాడు.

కణతలు నొక్కుకుంటూ బాధపడుతున్న దత్‌ను చూచి చిరునవ్వునవ్వి ఏమో అన్నాడు. దత్‌కు ఆ వృద్ధుడు అన్నదేమిటో అర్థంకాలేదు. వీరు నాగులా! అనుకున్నాడు నాగభాష కొద్దిగా తెలిసి ఉండటంచేత. ఆ వృద్ధుడు దత్ తలపైని కట్టువిప్పి ఆకుపసరు పూసి, మళ్ళీ కట్టు కట్టాడు. పొయ్యిమీద మసలుతున్న జావను చట్టిలో పోసి దత్‌కు అందించాడు. దత్ ఆత్రుతగా త్రాగాడు. తలనొప్పి తగ్గింది. దత్‌కు మళ్ళీ నిద్రవచ్చింది. వృద్ధుడు నెమ్మదిగా తలుపుచేరవేసి వెళ్లిపోయాడు.

## 3

మధుసూదన్‌దత్ కలకత్తాలో ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. అతని తలిదండ్రులు చిన్ననాడే గతించారు. నా అన్నవారులేక దత్ అనాథశరణాలయంలో పెరిగి పెద్దవాడయ్యాడు. పొట్టకూటి కోసం సైనికుడయ్యాడు. తగిన అవకాశమే లభించి ఉంటే దత్ గొప్ప మురళీగాయకుడై ఉండేవాడు. కాని విధి మరోవిధమైంది. మరుగుపడిన మాణిక్యం దత్. అతనిలోఉన్న సంగీతశక్తి నివురుగప్పిన నిప్పు. అతనిమురళీగానం జలజలపారే సన్నని సెలయేరులా, పైనుండి క్రిందికి దుమికే జలపాతంలా, పరవళ్లు త్రొక్కుతూ ప్రవహించే మహానదిలా, గంభీరంగా ఘోషించే మహాసముద్రంలా అన్ని రాగాల్లో అనేకరకాలుగా కదం తొక్కుతూంది. కాని అతనిలోఉన్న ప్రావీణ్యం గుర్తించి ప్రోత్సహించే వారుగానీ, అనుకూలించే పరిస్థితులుగానీ లేకపోయాయి. జీవితమంటే ఏమిటో తెలియని రోజుల్లో అతడెన్నో గాలిమేడలు కట్టాడు, తన భవిష్యత్తునుగూర్చి. గొప్ప గాయకుడు కావాలని కలలు కన్నాడు. కొంతకాలానికి అతనికి జీవితమంటే ఏమిటో తెలిసి వచ్చింది. అతడు కనిన కలలన్నీ కరిగిపోయాయి. గాలిమేడలు పేకమేడల్లా కూలిపోయాయి. దత్ స్వతహాగా కరుణహృదయుడు. ఇతరులకు ఏలాటి కష్టం కలిగినా సహించలేడు. తానై ఎవరికీ కష్టం కలిగించడం దత్‌కు రుచించదు. కానీ సైనికుడుగా అతని బాధ్యత ఇందుకు పూర్తిగా భిన్నమైనది. శత్రువులను యుద్ధంలో కాల్చి చంపుతూ ఉండాలి. సున్నితహృదయుడైన దత్ మొదట్లో చాలా బాధపడేవాడు. కొంతకాలం తరువాత గానీ అతడు అందుకు అలవాటు పడలేక పోయాడు.

ఆనాటియుద్ధంలో గాయపడి నాగుల చేతికి ఖైదీగా చిక్కాడు దత్. అతడిని స్వస్థుడుగా చేసేబాధ్యత ఒక వృద్ధునిమీద ఉంచారు. నాగుల గ్రామానికి ఆనాగవృద్ధుడు దత్‌ను చేరవేశాడు. పదిరోజులయ్యేసరికి దత్‌పూర్తిగా కోలుకున్నాడు. అతనికి నాగుల భాష క్రమంగా అర్థం కాసాగింది. నాగులు మొదట దత్‌ను అనుమానంగా చూచినా, దత్ నిస్సంశయంగా ఆగ్రామమంతా తిరిగి చూడసాగాడు.

నాగులు కలప, మట్టితో చిన్నకుటీరాలు నిర్మించుకొని నివసిస్తున్నారు. ప్రతివారింట్లోనూ వారు జయించిన తాలూకు శత్రువుల కపాలాలు తమ విజయ చిహ్నాలుగా అలంకరించుకున్నారు. వారికి కావలసిన దుస్తులను వారే ఇళ్ళలోతయారు చేసుకుంటున్నారు. ఆభరణాలుగా రంగు పూసలను హెచ్చుగా వాడుతున్నారు. మట్టిపాత్రల వాడకం ఎక్కువ. మగవారందరూ యుద్ధకళలో పెద్దలదగ్గర శిక్షణపొందుతున్నారు. పదేండ్లుదాటిన ఆడపిల్లలు 'రాషింగ్' అనేచోట అందరూకలిసి నివసిస్తున్నారు. పగలంతా గృహకృత్యాల్లో సాయపడి, ప్రొద్దువాలిన తరువాత రాషింగ్‌కు చేరుకుంటారు. వివాహమయ్యేవరకూ వారక్కడే నివసిస్తారు. స్త్రీలు, పురుషులు కలిసి పొలాల్లో పనిచేస్తున్నారు. గ్రామానికి పెద్దలు ముగ్గురు. గ్రామములో ఏదిజరిగినా వారిచేతిమీదుగనే జరగాలి. నాగులు ఎవరిమీదైనా విశ్వాసం కలిగితే వారికోసం ప్రాణమైనా ఇస్తారు. అయిష్టం కలిగించిన వ్యక్తి అంతు చూచేదాకా నిద్రపోరు.

దత్ వారి ఆచారాలను, వ్యవహారాలను, భాషను బాగా అలవరచుకొన్నాడు. దత్ చక్కగా తయారు చేసే ఆటవస్తువుల మూలంగా ఆకర్షించబడి అనేకమంది పిల్లలు రాసాగారు. క్రమంగా దత్ వారిహృదయాల్లో స్థానం సంపాదించుకొన్నాడు. నాగుల జానపద గేయాలను మురళిపై చక్కగా గానంచేసేవాడు. క్రమంగా పెద్దవారుకూడా వచ్చిపోసాగారు. నాగభాషను చక్కగా నేర్చిన దత్, నాగుల జానపదగాథలను గూర్చి, అవీ, భారత రామాయణ కథలూ చెప్పేవాడు. దత్ మురళివాయిస్తూంటే, కథలు చెప్పుతూంటే, నాగస్వరం వింటూన్న పాముల్లా నాగులు ముగ్ధులై వింటూండేవారు. కొద్దికాలం గడిచేసరికి దత్ వారివేషభాషలు కూడా అలవరచుకొని వారిలో ఒక్కడైపోయాడు. దత్‌కు ఇప్పుడు పూర్తిగా స్వేచ్ఛ లభించింది. కాని ఆగ్రామపు పొలిమేరలు మాత్రం దాటి


నారసింహ లేహ్యం
బంగారు చేరినది. మేహము, నిస్సత్తువను హరించి వీర్యవృద్ధిని, బలమును, రక్తవృద్ధిని కలిగించును.
20 తు డబ్బీ రు. 3-8-0.

రోజాపుష్ప లేహ్యము
అజీర్ణం, గర్భవాతం, మలబద్ధకం హరించి చక్కగా విరేచనమును, జీర్ణశక్తిని కలిగించును. 15 తు. డబ్బీ రు.1-4-0; పోస్టేజి రు.1-1-0.
మా క్యాటలాగు, కాలెండరు ఉచితం.
పి. సి. పి. అండ్ కో, ఆయుర్వేద సమాజం, పెరిదేపి, నెల్లూరు జిల్లా.

మొటిమలు మాయమగును
చర్మము మృదువుగా శుభ్రపడును
నిక్సోడెర్మ్ (NIXODERM)ను రాసినతో మొటిమలు మాయమగును. రేపటి రాత్రి నిక్సోడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, బాగానుగాను శుభ్రపడునని గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, తామర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సోడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మవ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిశ్చయముగా పోగొట్టి చర్మమును మృదువుగాను, బాగుగాను శుభ్రము చేయు నిక్సోడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

చాలాకాలమన్నికైనవి

"సులేఖ" మరియు "బ్రీఫ్‌మన్" ఫౌంటెన్‌పెన్‌లు
PENMEN'S INDUSTRIAL SERVICES
BOMBAY-67.

పోకూడదని షరతుపెట్టారు గ్రామపెద్దలు. అతడు వెళ్లితే తమగ్రామపు ఆనుపానులు శత్రుసైన్యానికి తెలిసిపోతాయని వారు భయపడి ఆ నిబంధన పెట్టారు.

దత్‌ను కాపాడిన నాగవృద్ధుడు అతడిని తన పుత్రుడులా ఆదరించాడు. ఆనాగవృద్ధునికి కావలసినవారెవరూ లేరు. ఉన్న ఒక్క కుమారుడు యుద్ధంలో మరణించాడు. కనుక ఆనాగవృద్ధుడు దత్‌ను తనకుటీరంలో ఉంచుకున్నాడు. నాగులు క్రూరులనీ, అనాగరకులనీ అదివరకు అనుకున్న దత్, వారి ప్రవర్తనచూచి తనఅభిప్రాయం మార్చుకున్నాడు. ఏవో దుష్టశక్తులు వారివెనుక నుండి రెచ్చగొడితేనే తప్ప, వారంతటవారు తిరుగుబాటుకు పాల్పడిఉండరని భావించాడు. అమాయకులైన వీరిని తమ స్వార్థప్రయోజ

# త్యాగి

నానికి ఉపయోగించుకొంటున్న ఆ అరాజక శక్తులేవో?

ఒకరోజు గ్రామం వెలుపలి అడవిలో దత్ కట్టెలు కొట్టుకొని వస్తున్నాడు. సంధ్యారాగం నలుప్రక్కలా కమ్ముకుంటూంది. పక్షులు కలకలలాడుతూ తమగూళ్లనుచేరుకొంటున్నాయి. దూరంగా నక్కల అరుపులు వినిపిస్తున్నాయి. దత్ ఇవన్నీ పరికిస్తూ మెల్లగా నడకసాగిస్తున్నాడు. అకస్మాత్తుగా దత్‌కు చిరుత పులి అరుపు, వెనువెంటనే కెవ్వుమనే ఆర్తనాదం వినిపించాయి. దత్ కట్టెల మోపు క్రిందపడేసి ఆర్తనాదం వచ్చిన దిక్కుకు పరుగెత్తాడు.

కొద్దిదూరంలోనే అతనికి దారుణమైన దృశ్యం కంటబడింది. ఒక నాగయువతిని చిరుతపులి ఆక్రమించ ప్రయత్నిస్తున్నది. ఆ నాగయువతి తనచేతిలోని కర్రతో దానిని పారద్రోలాలని విఫలయత్నం చేస్తూంది. దత్ మొలలోని బాకుదూసి చిరుతపులిమీద కలియబడ్డాడు. చిరుతపులి దత్‌భుజాన్ని పంజాతో చీల్చేసింది. దత్ గట్టిగా విదిలించి దానిని దూరంగా పడద్రోశాడు. నేలను గొట్టిన బంతిలా ఎగసి వచ్చింది చిరుతపులి. దత్ తనబలమంతా ఉపయోగించి, మెడతోపేచీవేసి దానిని క్రిందపడగొట్టి బాకుతో పొడిచి అంతమొందించాడు. అతనిభుజాలు రెండూ చీరిపోయి ఉన్నాయి. దత్ నడుపబోయి అశక్తుడై కూలబడ్డాడు. అంతవరకూ వణుకుతూ ఒకవార నిలిచిన నాగయువతి దత్ దగ్గరకువచ్చి, చేయూతనిచ్చి లేవదీసింది. ఆమెఆధారంతో దత్ తనకుటీరానికి చేరుకున్నాడు. దత్‌పులిని ఎదిరించి చంపాడని తెలుసుకుని నాగులందరూ అతని శక్తిసామర్థ్యాలను అభినందించారు. ఆమెతండ్రి వజరికో ముగ్గురు గ్రామపెద్దలలో ఒకడు. వజరికో వచ్చి తనకుమార్తెను చిరుతపులిబారినుండి కాపాడినందుకు దత్‌కు కృతజ్ఞత తెలిపాడు. తన కుమార్తె జమిలీని దత్‌కు ఆరోగ్యం చేకూరేవరకూ ఉపచరించమని నియోగించాడు.

ఆవిధంగా జమిలీ, దత్‌లమధ్య పరిచయం ఏర్పడింది. రోజులు గడుస్తున్నాయి. ఇప్పుడు జమిలీ, దత్‌ను చూడకుండా ఒకదినంకూడా ఉండలేకపోతూంది. ప్రతిరోజూ అతనికి ఆహారం చేకూర్చిపెట్టే బాధ్యత తనపైన వేసుకుంది. ప్రతిరోజూ ప్రొద్దువాలేసరికి జమిలీ సెలయేటిఒడ్డున మురళీగానంచేసే దత్ ముందు రెక్కలుకట్టుకొని వ్రాలేది. ఆవేశంతో దత్ మురళీగానం చేస్తూంటే, ఆగానప్రవాహంలో ఆమె మునకలువేస్తూ పరవశ అయ్యేది. ముగ్ధురాలైన ఆమె, దత్‌మురళీగానం ఆపేవరకూ ఈలోకంలో ఉండేదికాదు. ఏ దివ్యలోకాల్లోనో తేలిపోతున్నట్లు కనిపించేది. కాలక్రమాన వారి పరిచయకుసుమం ప్రణయంగా వికసించింది. ఆవనంలో వారిద్దరూ రాధాకృష్ణులై విహరించేవారు. వారిద్దరి హృదయాలూ ఇప్పుడొకటే. జమిలీ, దత్‌ను తన దైవంగా ఆరాధిస్తూంది. దత్‌పాలిట దేవత ఆమె. వారివలపు మోసులెత్తి, నిండుగా పుష్పించి వికసించింది. వారు ఎడబాస్తే వారి జీవితమే ఎడారవుతుందేమోనన్నంత గాఢంగా మారింది వారిమైత్రి. ఒకరు లేకపోతే రెండవ వారికి జీవితం అంధకారప్రాయం. దత్, జమిలీని పెద్దలఅనుమతి తీసుకొని భార్యగా స్వీకరించాలనుకున్నాడు. కానీ జమిలీ అందుకు తగిన సమయం వచ్చినప్పుడు చూదామని ఆపుచేసింది.

(తరువాయి 47వ పేజీలో)



# త్యాగి

( 12 వ పేజీ తరువాయి)

## 4

గ్రామపెద్దల్లో ఒకని కుమారుడు శరభుజో. జమిలీ, దత్‌లు కలిసి తిరగడం అతనికి కంటగింపైంది. శరభుజో చిన్ననాటినుండీ జమిలీ మీద ఆశలుపెట్టుకొని ఉన్నాడు. జమిలీ తనదే నన్న విశ్వాసం అతనిలో స్థిరపడిపోయింది. ఇప్పుడు ఈ దత్తెవడో వచ్చి మధ్య అడ్డుపడ్డాడు. జమిలీ, శరభుజోను కన్నెత్తైనా చూడటం మానేసింది. శరభుజో, జమిలీమనసును తనవైపు త్రిప్పుకొనడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఆమె అతనిని కసరికొట్టింది. శరభుజో తోకతొక్కిన త్రాచులా బుస్సుమన్నాడు. చిన్ననాటినుండీ వెంట జంటగా ఉన్న తన్ను తిరస్కరించి, ఎవడో బందీగా చిక్కి, ఇక్కడికి చేరుకున్న శత్రు సైనికునా ప్రేమించేది? అనుకుంటూ అతడు అవమానంతో మండిపోయాడు. తనలోకంటే ఆ పరదేశిలో ఏమి గొప్పతనం చూసి జమిలీ వాడంటే అంత ఆరాటపడుతూంది? గొప్ప వీరుడవా? తనూ చంపాడే ఎందరో శత్రువులను; క్రూరమృగాలను? ఆమె కావాలన్న ప్రతిదీ తెచ్చి ఇచ్చాడే క్షణాలమీద? తనలోని లోటేమిటి?

శరభుజో ఆలోచిస్తూ నడుస్తున్నాడు. దగ్గరలో కందమూలాలను తవ్వి తీస్తున్న జమిలీ కనిపించింది. శరభుజో అక్కడికి వెళ్లాడు. జమిలీ, శరభుజో రాకను గమనించి కూడా తెలియనట్టు తనపని సాగిస్తూంది. చివరికి శరభుజోయే పలకరించాడు.

"జమిలీ, ఆమాటగురించి ఏమంటావు?"

"ఏమాట?"

"మన పెండ్లిమాట. వారంరోజుల క్రితం చెప్పలేదూ?"

"నేనూ చెప్పాను, ఆమాట ఇక ఎత్తవద్దని."

"జమిలీ! నువ్వా ఖైదీని ప్రేమిస్తున్నావు కదూ?"

జమిలీ ఎర్రగా చూసి ముఖం దించుకుంది.

"జమిలీ! వాడు నిన్ను మోసగిస్తున్నాడు. ఏదోరోజున వాడు అవకాశం దొరికితే ఇక్కడి నుండి పారిపోతాడు. అప్పుడు నీ గతేమవుతుందో ఆలోచించుకో!"

"అతనంత పిరికివాడూ కాదు ద్రోహీకాదు."

శరభుజో పిడికిలి బిగించాడు, కళ్లు జేవురించాయి.

"వాడు శత్రుసైనికుడు. మరొకజాతివాడు. వాడికి నిన్ను పెండ్లాడేఅర్హత, హక్కు లేవు. నాగులు అతన్ని నీవు వివాహమాడేందుకు అంగీకరించరు."

జమిలీ వెళ్లిపోవడానికి లేచి నిలబడింది. శరభుజో చేయి పట్టుకొని ఆపుచేయబోయాడు. జమిలీ చెయ్యివిదిలించుకుని చరచర వెళ్లిపోయింది. శరభుజో నిశ్చేష్టుడై నిలబడ్డాడు కొద్దిసేపు. అతనిలో క్రోధాగ్ని రగులుతూంది. జమిలీగనక సహించాడు గానీ, మరొకరివల్ల అంత అవమానం జరిగిఉంటే వారి అంతుతేల్చి ఉండేవాడు. శరభుజో బరువుగా అడుగులువేసుకుంటూ రచ్చబండ దగ్గరకు వెళ్లాడు. తెల్లబడిన అతని ముఖం చూసి రచ్చ బండదగ్గరున్న నజరికో ఆశ్చర్యపడ్డాడు.

"శరభుజో! ఏం జరిగింది?"

"మనజాతి యువతిని ఒక శత్రుసైన్యానికి చెందినవాడు, అన్యజాతీయుడు వివాహం చేసుకొనడానికి మీరు అంగీకరిస్తారా?"

"అసంభవం. అందుకు మన ఆచారాలు ఎంతమాత్రం ఒప్పుకోవు. కానీ ఆ విజాతీయుడు మన జాతిలో కలిసిపోవడానికి త్రికరణశుద్ధిగా అంగీకరించి, తన ప్రవర్తన మూలంగా పెద్దలను మెప్పించినట్లయితే, ఉభయపక్షాల సమ్మతితో అటువంటి వివాహం సాధ్యపడవచ్చు. కానీ అటువంటిది చాలా అరుదు. ఇంతకూ ఆ నాగ యువతి ఎవరు?"

"మీ అమ్మాయే! జమిలీ!" శరభుజోనుంచి శరవేగంతో దూసుకువచ్చింది జవాబు.

నజరికో అప్రతిభుడయాడు.

"అయితే జమిలీ దత్‌ను ప్రేమిస్తూందా?" నజరికో అతికష్టం మీద ప్రశ్నించాడు.

"ఆ విషయం మీ అమ్మాయినే అడగడం మంచిది. నేను ముందే చెప్తున్నాను. ఈ వ్యవహారం ముదిరిపోకుండా ఇంతటితో కట్టిపెడితే చాలా మంచిది. తరువాత పెద్దపేరు వచ్చినా చేసేదేమీలేదు. ఈ విషయం నేను రేపే గ్రామ ప్రజలముందు పెడతాను. చిన్ననాటినుండీ జమిలీని నేనెంత అభిమానిస్తున్నానో మీకు తెలిసిన విషయమే. ఆమెను నేను వదులుకోవడానికి, అందులో విజాతీయుడైన ఒక శత్రువు వలలో వదిలిపెట్టడానికి ఎంతమాత్రం అంగీకరించను." శరభుజో, నజరికో సమాధానం కోసం ఎదురుచూడకుండా నిష్క్రమించాడు. నజరికో శూన్యంలోనికి చూస్తూ నిలబడ్డాడు.

మరునాడు గ్రామప్రజల్లోని పెద్దలు, వృద్ధులు శరభుజో కోరికమీద సమావేశమయారు. గ్రామ పెద్దలు ముగ్గురూ వేదికపైన ఆసీనులయారు. శరభుజో తన తండ్రి వెనుక నిలబడి ఉన్నాడు. జమిలీ నిర్లక్ష్యంగా కళ్లు చిట్లించి శరభుజో వంక కోపంగా చూస్తూంది. ఆమె చూపులకు తట్టుకోవలేక శరభుజో ముఖం మరొకవంకకు త్రిప్పుకున్నాడు. దత్‌కు రచ్చబండదగ్గరకు రావలసినదని కబురు వెళ్లింది. దత్ ఇన్నాళ్లూ లేనిది, తనకీనాడు పిలుపువచ్చిందేమిటా అని ఆశ్చర్యపడుతూవచ్చాడు. శరభుజో అతడిని మింగేసేటట్లు కొరకొరా చూస్తున్నాడు. చుట్టూ ఉన్న ప్రజలు గుసగుసలాడుతున్నారు.

మొదటి గ్రామపెద్ద లేచి నిలబడి చెయ్యి ఊచాడు. గుసగుసలన్నీ ఆగిపోయాయి. చుట్టూ ఉన్నజనాన్ని ఒకమారు కలయచూసి "జమిలీ" అని పిలిచాడు. జమిలీ ఎదురుగా వచ్చి నిలబడింది.



క్షీత హారిదేక్షణ

చిత్రం—ఎమ్. శంకరరావు (అనకాపల్లి)

### విజ్ఞప్తి

*ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణార్థం కథలు, గేయాలు, ఫోటోలు, చిత్రాలు మున్నగునవి పంపేవారు పేరు, పూర్తి చిరునామా స్పష్టంగా వ్రాయవలసి ఉన్నది. ప్రచురణకు అంగీకరించే పక్షంలో ఆసంగతి తెలియపరచడము, ప్రచురణార్హం కాకపోతే త్రిప్పి పంపడము దుస్తరం అవుతున్న కారణంచేత ప్రత్యేకంగా ఈ విజ్ఞప్తి చేస్తున్నాము.*

—ఎడిటర్

"నీవు దత్‌ను ప్రేమిస్తున్నావా?" సూటిగా ప్రశ్నించాడు గ్రామపెద్ద.

"అవును."

"అతడు నిన్ను విడిచిపెట్టడనీ, పారిపోడనీ నీకు నమ్మకముందా?"

"ఆ!"

"నిన్ను అతడు వివాహం చేసుకుంటా నన్నాడా?"

"అవును."

"నిన్నుశరభుజో చిన్ననాటినుండీప్రేమిస్తూ, నీవంటే ఎంతో అభిమానం చూపిస్తున్నాడే. అతనంటే నీకెందు కిష్టం లేదు?"

"చిన్ననాటినుండీ కలిసి తిరిగినంతమాత్రాన పెళ్లి చేసుకోవాలని లేదు. నా కిష్టం లేదంతే."

"శరభుజో!" గ్రామపెద్ద పిలిచాడు.

"నీకు జమిలీ అంటే చాలా అభిమానముందా?

"ఆ విషయం ఇక్కడ ప్రతిఒక్కరికీ తెలుసు."

"కానీ, జమిలీ నీప్రేమ అంగీకరించడంలేదు. ఆమెపైన నీవు ఆశ వదులుకోవా?"

"నాకంఠంలో ప్రాణం ఉండేవరకూ జమిలీ మీద ఆశ వదులుకోను. జమిలీని దక్కించుకొనడానికి ఏమైనా సరే చేస్తాను."

"దత్!"

దత్ ముందుకు నడిచాడు.

దత్ ముందుకు నడిచాడు.

"నీవు జమిలీని ప్రేమించావా?"

"అవును."

"ఆమెను వివాహంచేసుకునేఉద్దేశ్యముందా?"

"వీలైతే త్వరలోనే చేసుకుందా మను కొంటున్నాను."

"నాగుల కట్టుబాట్లు నీవు నాగయువతిని వివాహమాడడానికి అంగీకరించవని తెలుసునా?"

"జమిలీకోసం ప్రాణత్యాగానికైనా వెను దీయను. ఆ కట్టుబాట్లను లెక్కచేయను."

"నీకు ఒకేమార్గం ఉంది. నీవు త్రికరణ శుద్ధిగా నాగజాతిలో కలిసిపోవాలి. మా కట్టు బాట్లను అన్నిటినీ అంగీకరించి, అనుసరించాలి."

"నేను మీలో ఎన్నడో కలిసిపోయాను."

గ్రామపెద్ద ప్రజలవంక తిరిగాడు. "మీలో దత్ మనలో కలవడానికి అంగీకరించేవారు చేతు లెత్తండి." చాలామంది అంగీకార సూచకంగా చేతులెత్తారు. గ్రామపెద్ద మిగతా పెద్దలను కలుసుకున్నాడు. వారిలో కొద్దిగా వివాదం చెల రేగింది. దత్‌పక్షాన కొందరూ, శరభుజోపక్షాన కొందరూ వాదిస్తున్నారు. చివరి కెటూ తెగ లేదు. గ్రామపెద్ద ప్రజల ముందరికి వచ్చి "దత్, శరభుజోలు ఇద్దరూ జమిలీని వివాహ మాడడానికి అర్హులే. కొందరు దత్‌కు అను కూలంగానూ, మరికొందరు శరభుజోకు అను కూలంగానూ మాట్లాడుతున్నారు. కనుక జమిలీని ఎవరు వివాహమాడాలనే విషయం వివాదగ్రస్తమైంది. అందువలన శరభుజో దత్‌లు ఇద్దరూ ద్వంద్వయుద్ధంలో పాల్గొనా లని, అందులో గెలిచినవారు జమిలీని వివాహం చేసుకోవాలనీ, ఓడిపోయినవారు కన్యతోపాటు కళ్లను కోల్పోవాలనీ నిశ్చయించాము. ఓడిపోయిన వారికి ఇదివరలో మరణశిక్ష విధించేవారు. కాని ఇప్పుడు పోటీపడుతున్న వారిద్దరూ మనం దరికీ ఇష్టులే. అందువలన వారిలో ఎవరికైనా మరణశిక్ష విధిస్తే మనలో చాలామంది బాధ పడుతారు. గనుక కళ్లు తీసివేయడం మాత్రమే శిక్షగా విధించబడింది" అని చెప్పగానే ప్రజలు గొల్లున అరిచారు.

జమిలీ ఆనాటిరాత్రి దత్‌ను రహస్యంగా కలుసుకుంది. అక్కడినుండి పారిపోదామని బ్రతిమలాడింది. దత్ తానటువంటి సిగ్గుమాలిన పనిచేయనని తిరస్కరించాడు. జమిలీని ఊర డించి పంపాడు.

## 5

తెల్లవారింది. ప్రజలంతా రచ్చబండదగ్గర గుమిగూడారు. వలయాకారంగా తీరికూర్చు న్నారు. వాయిద్యాలు, తప్పెట్లు మిన్నంటే టట్లు మారుమ్రోగుతున్నాయి. సంప్రదాయ సిద్ధమైన నృత్యం, బృందగానం సాగుతున్నాయి. పెద్దలు ఒక్కొక్కరేవచ్చి తమ స్థానాల్లో కూర్చున్నారు. జమిలీ పూలమాలతో స్త్రీల మధ్య ఆందోళనపడుతూ కూర్చుంది. దత్, శరభుజోలు వచ్చి వలయాకారంగా ఉన్న రంగ స్థలంలో నిలబడ్డారు. ఇద్దరికీ తళతళమెరు స్తున్నబాకులు చెరొకటి ఇచ్చాడు గ్రామపెద్ద. ప్రాణాపాయం కలిగేవిధంగా గాయాలు కలుగ చేయకూడదనీ, అలాచేస్తే శిక్షింపబడతారనీ చెప్పి గ్రామపెద్ద వెనక్కువెళ్లాడు. వాయిద్యాల శబ్దం మిన్నుముట్టింది, జనం కోలాహలంతో పాటు. గ్రామపెద్ద చేయివిసిరాడు. దత్, శరభుజోలు కలియబడ్డారు. దత్‌కు ఇదంతా క్రొత్తగా ఉంది. ఇంతవరకూ అతడు సాముా హిక యుద్ధంలో పోరాడాడేగానీ, సరదాకైనా ఎవరితోనూ బాహాబాహీ పోరాడి ఎరుగడు. అందులోని ఒడుపులుగానీ, పద్ధతులుగానీ దత్‌కు తెలియవు. చిన్ననాటినుండీ ఆవిద్యను అభ్యసించి ఆరితేరిన శరభుజో దత్‌ను తన ఇష్టం వచ్చినట్లు ఆడిస్తున్నాడు. మొదటి నుండీ శరభుజోదే పైచెయ్యిగా ఉంది. దత్ అతికష్టంమీదగానీ శరభుజో తీసే దెబ్బలకు తట్టుకొనలేకపోతున్నాడు. శరభుజో దత్‌ను ముప్పుతిప్పలు పెట్టి కవ్విస్తున్నాడు. దత్‌కు ఆయాసం ఎక్కువైపోయింది.

పోరాడుతున్నవారికంటే చుట్టూచేరిన జనంలో ఆవేశం ఎక్కువైపోతూంది. తమ కిష్టులైన వారు పైచేయిగా కనపడినప్పుడల్లా వారి అభిమానులు గొల్లుమని అరిచి, చప్పట్లు చరు స్తున్నారు. జమిలీ, దత్ శరభుజో చేతిలో నలిగి పోతున్నాడని గ్రహించింది. ఆమె ఆవేశంతో కేకలు వేస్తూంది. శరభుజో సమయం చూచి విజృంభించాడు. ఆయాసపడిపోయిన దత్

డాక్టర్ వృత్తి చేయండి!
ఇంటిలో విరామంగా కూర్చొని వుండేప్పుడు పోసల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటు రిజిష్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.
వివరములకు వెంటనే వ్రాయండి:
INDIAN HOMOEOPATHIC COLLEGE
(A.W.P.) JULLUNDUR CITY

తాంబూలములకు
యాలక్కాయ,లవంగము యిప్పుడు అక్కరలేదు.
రూచి
సుగంధ ద్రవ్య సముదాయము.
పచ్చకర్పూరం, కుంకు పువ్వు చేర్చబడినది.
అన్ని కిరాణా కొట్లలో దొరుకును.
కిళ్లీకొట్లలో వాడబడుచున్నది.
శ్రీ పొ. రు. 3—25, పోస్టేజి అదనం.
నావాకొన్నమటిక్సు, విజయవాడ—2.

35 సం. పైబడిన
స్త్రీ పురుషులకు వరప్రసాదము
35 సం. పై బడిన స్త్రీ పురుషులు మూత్రాశయపు వ్యాధులతో నిర్వీర్యులై దౌర్బల్యముతోనుందురు. నెప్పిపోటు, కీళ్ళనొప్పులు, బాధతోకూడిన మూత్రవిసర్జన, రాత్రి వేళ పగలు తరచుగా మూత్రము విడచుట, కాళ్ళ నొప్పులు, నిద్రలేకుండుట, బలహీనత మొదలగు లక్షణములకు మూత్రాశయపు వ్యాధులే కారణములౌనవచ్చును. చలి, జ్వరము కూడా తరచుగా ఆపాదించవచ్చును. 30 సం. నుండి యీ మూత్రాశయపు వ్యాధులకు వేలకొలది రోగులు సిస్టెక్స్ (CYSTEX)ను వాడుచున్నారు. నేడే సిస్టెక్స్ (CYSTEX)ను మీ కెమిస్టు వద్ద కొనండి. ఇది శీఘ్రముగా గుణమునిచ్చును. తప్పక తృప్తినివ్వగలదు. తృప్తిగా వ్యక్తపర చేకూరదితో పైకమును సంప్రదించవలెను.

# త్యాగి

శరభుజో తీసేదెబ్బలకు ఎదుర్కొడ్డుకోలేక పోతున్నాడు. శరభుజో దత్ కుడిచెయ్యిమెలివేసి, ఎడమభుజంలో తనబాకును మెరపులా గుచ్చేశాడు. దత్ క్రింద తూలిపడ్డాడు. జనసమూహం శరభుజోకు జయధ్వానాలు చేస్తూ లేచారు. దత్ వద్దకు పరుగెత్తబోతున్న జమిలీని నజరికో ఆపుచేశాడు. "ఇక నీవతన్ని మరిచిపోవాలి. నేటి నుండి నీవు శరభుజో భార్యవు" అన్నాడు కోపంగా చూస్తూ. జమిలీ పంజరంలోపెట్టిన చిలకలా నిస్సహాయంగా నిలబడింది. శరభుజో సగర్వంగా ఆమెప్రక్క నిలబడ్డాడు.

గ్రామపెద్ద దత్‌వద్దకువచ్చి అతని భుజం మీద చేయివేశాడు. నాగవైద్యుడువచ్చి దత్ భుజంలోని బాకునుతీసివేసి కట్టుకట్టాడు. గ్రామపెద్ద "దత్! నీకళ్ళు తీసివేస్తారు. చాలాబాధకరమైన సంగతి. కానీ నిబంధనలను నెరవేర్చక తీరదు. ఇవాళ ఒకడిని కనికరించి వదిలిపెడితే రేపు మరొకడు తా నెంతపెద్ద తప్పుచేసినా అది ఆధారంగాచూపి శిక్షను తప్పించుకొనడానికి ప్రయత్నిస్తాడు. అందువల్ల నీపైన మాకెంత అభిమానమున్నా నిన్ని శిక్షకు గురిచెయ్యక తప్పడం లేదు. నీవిప్పు డాబాధ భరించుకొనగలవా?" అన్నాడు. దత్‌కు జమిలీని పోగొట్టుకున్నతరువాత కళ్ళుపోగొట్టుకొనడం ఒకబాధా అనిపిస్తూంది. ఆమెను పరాయిదానిగా ఈకళ్ళతో చూచి సహించలేడు. "ఫరవాలేదు. కానివ్వండి. కానీ ముందు చివరిసారిగా జమిలీని చూడనివ్వండి. అంతకంటే నేను కోరేదేమీ లేదు" అన్నాడు ఆవేదనతో.

గ్రామపెద్ద జమిలీని దత్ ఎదుటికి రప్పించాడు. దత్ తలయెత్తి సూటిగా జమిలీవంక చూశాడు. జమిలీ ఆవేగంతో అతనివంకే చూస్తూంది. రెండు చూపులూ కలుసుకొని నిశ్చలమయ్యాయి. చుట్టూజనం నిశ్శబ్దంగ నిలబడిచూస్తున్నారు. గ్రామపెద్ద తనప్రక్కవారికి సంజ్ఞచేశాడు. ఇద్దరువచ్చి దత్‌కు ఇరుప్రక్కలా నిలబడ్డారు. నజరికోవచ్చి జమిలీని తీసుకుపోయాడు. దత్ కళ్ళకు గంతలుకట్టబడ్డాయి. ఇద్దరు అతనిభుజాలు పట్టుకొని కదలకుండా నొక్కిపట్టారు. దత్ ఏమిజరుగుతుందో తెలుసుకునేలోపలే అతని రెండు నేత్రాలలో రెండు వాడిసూదులు దిగిపోయాయి. భయంకరమైన అంధకారం అలముకొంది. కళ్ళురెండూ భగ్గున మండిపోతున్నాయి. దత్‌పళ్ళు గిట్టకరిచి బాధను సహిస్తున్నాడు. సూదులుతొలగిపోయాయి. కళ్ళగంతలు విప్పేశారు. కళ్ళనుండి రక్తం ధారలు కడుతూంది. వెనుకనుండి జమిలీ ఆక్రందన వినిపిస్తూంది. వెనక్కు తిరిగి చూచాడు, దత్ తాను అంధుడననేసంగతి మరిచిపోయి. ఏమీ కనిపించలేదు. విషాదంగా నవ్వుకున్నాడు దత్. ఎవరో అతనిచేయి పట్టుకొని నడిపిస్తున్నారు. మెత్తనిపడకమీద పడుకోపెట్టబడ్డాడు. మండిపోతున్న అతని అంధనేత్రాలలో చల్లనిద్రవమేదో పడింది. మంట చల్లారింది. మృదువైన పదార్థమేదో కళ్ళపైన ఉంచి కట్టుకట్టినట్లు గ్రహించాడు. "బాబా!" అన్నాడు తనకందిన హస్తాన్ని స్పృశిస్తూ. "ఏం బాబూ! నన్ను గుర్తించావా?" అన్నాడావృద్ధుడు. ఇంతకుముందు అతన్ని సాకిన నాగవృద్ధుడే అతడు. "మాట్లాడకుండా పడుకోబాబూ! రేపటికల్లా పోటు తగ్గిపోతుంది" అన్నాడు అవృద్ధుడు దత్ తలనిమురుతూ. దత్ తనవిఫల ప్రణయోదంతాన్ని నెమరువేస్తూ మగతనిద్రలో పడ్డాడు. అతనికిక కన్నుమూసినా, తెరిచినా ఒకటే! అంధకారం!

## 6


దత్ ఇప్పుడు వేదాంతిలా తయారయాడు. ఎప్పుడూ ఏమిటో ఆలోచిస్తూనే ఉండేవాడు. దినంలో హెచ్చుభాగం కథలుచెప్పడంలోనూ సంగీతం వినిపించడంలోనూ గడిపేవాడు. సంధ్యాసమయంలో మాత్రం పూర్వంలానూ, జమిలీ కలుసుకునే సంకేతస్థలానికివెళ్లిపోయేవాడు. అక్కడ ప్రవహించే సెలయేటి మర్మరధ్వనులు వింటూ, తనమురళీగానంతో ఆప్రదేశాన్నంతా నింపేవాడు. ఆమురళీగానాన్ని వినడానికి అతని చుట్టూ ఎన్నో విషసర్పాలు పడగలెత్తి నిలబడేవి. ఎటువంటి సర్పమైనా దత్ మురళీనాదం వినేసరికి మంత్రించినట్లు పుట్టలలోనుండి వెలుపలికి వచ్చేది. అతనికళ్లముందు వెలుపలి ప్రపంచం మూతబడిన తరువాత అంతరంగ ద్వారం తెరుచుకుంది. అదొక దివ్యానుభూతి. ఆ దివ్యశక్తి అవ్యక్తమధురమై మురళిలోనుండి గానరూపంగా ప్రవహిస్తున్నట్లుండేది. మురళిని చేతపట్టిన తరువాత దత్‌అతిలోకమానవుడు. ఈ ప్రపంచానికి అతీతుడు. అతడు మురళిని వాయిస్తూంటే ప్రకృతి పరవశమవుతూంది.


నాగులందరికీ ఇప్పుడాతడు పరమాప్తుడు. దత్‌కు శరభుజోపైన ద్వేషంగానీ, అసూయగానీ కలుగలేదు. జమిలీని చేపట్టగలిగిన శరభుజో అదృష్టవంతుడనుకొన్నాడు. జమిలీ ఎపుడన్నా పలుకరిస్తే తప్ప తానై ఎప్పుడూ మాట్లాడడానికి ప్రయత్నించేవాడు కాదు.

శరభుజో అడవిలో తేనెపట్లకోసం తిరిగేవాడు. తేనెపట్టుసంపాదించడంలో అతన్ని మించినవారు గ్రామంలో లేరు. ఒకనాడు యథాప్రకారంగా శరభుజో అడవిలో తేనెపట్లకోసం తిరుగుతున్నాడు. కొండవాలుచాటునున్న ఒకతేనెపట్టు శరభుజో కంటపడింది. చాలా పెద్దపట్టు అది. దాన్నిగనక కొడితే ఇక రెండు మూడు నెలలదాకా తనకీపని ఉండదనుకున్నాడు శరభుజో. కాని అతనితో సహాయంగా వచ్చిన వృద్ధుడు ఆకొండ చరియల్లో భయంకరమైన సర్పముందనీ, ఆచరియలో అడుగు పెట్టడం ప్రాణానికే ముప్పనీ హెచ్చరించాడు. శరభుజో పెడచెవినిపెట్టి, "ఇంతకంటే కష్టమైనవెన్నో సాధించాను. ఇదొకలెక్కా?" అంటూ ఆచరియలోకి ప్రవేశించాడు. తేనెపట్టు కాస్త ఎత్తుగా ఉంది. దానిని అందుకొనడానికి ప్రక్కనేఉన్న కొండవాలు ఎక్కాడు శరభుజో. ఇంతలో వెనుకనుండి వృద్ధుడు అరిచాడు: "శరభుజో! శరభుజో! నీవెనుక పాము." శరభుజో వెనుదిరిగి చూచాడు. ఆరడుగల పొడవున్న మహాసర్పమొకటి చరచర ప్రాకివస్తూంది. శరభుజో రెప్పపాటులో మొలలోని బాకుతీసి గురిచూచి విసిరాడు. బెత్తెడుయెడంలో గురితప్పి బాకు కొండచరియలో చొచ్చుకుపోయింది. శరభుజో మరగులు కక్కుతూ క్రిందపడ్డాడు. వృద్ధుడు సహాయంకోసం గ్రామంవంక పరుగెత్తాడు.

గ్రామప్రజలూ, పెద్దలూ, జమిలీ పరుగు పరుగున కొండచరియకు చేరుకున్నారు. నాగవైద్యుడు శరభుజోను పరీక్షించాడు. నాడి బలహీనంగా కొట్టుకుంటూంది. నాగవైద్యుడు తనదగ్గరఉన్న విరుగుడు అన్నిటిని వాడిచూచాడు. గానీ ఫలితం కనుపించలేదు. నిస్పృహతో "ఇది

గోపుర దర్శనం (చిదంబరం) ఫోటో—వి. వి. రామన్ (కోయంబత్తూరు)





కన్నకడుపు

ఫోటో—పి. కృష్ణకుమార్ (తాడేపల్లిగూడెం)

జాతిసర్పపు కాటు. ఈవిషం సులభంగా విరుగుడు కాదు. ఆసర్పంచేతనే తిరిగి మరొకమారు కాటువేయిస్తేనేగాని మందులు పనిచెయ్యవు. ఒక జాములోపల ఇది జరిగిపోవాలి. అసర్పాన్ని రప్పించి, కాటేయించడం ఎలా?" అన్నాడు. అందరూ మౌనంగా నిలబడ్డారు. ఏమిచేయాలో ఎవరికీ తోచలేదు. పామును పైకిరప్పించడానికి కొండనుతవ్వాలా? పోనీరప్పిస్తే అది తన ఇష్టం ప్రకారం ప్రవర్తిస్తుందా? ఇదే అందరికీ సందేహం. జమిలీకి దత్ శక్తిసామర్థ్యాలు గుర్తుకువచ్చాయి. వెంటనే ఆమె సెలయేటి వంక పరుగుపెట్టింది. అందరూ జమిలీకి పిచ్చెక్కలేదుకదా, భర్తమరణావస్థలో ఉంటే అలా ఎక్కడికి పరుగెడుతూందని చెవులు కొరుక్కున్నారు.

లేడిలా పరుగెత్తి దత్ సమీపానికి వెళ్ళింది జమిలీ. ఆయాసంతో జమిలీ ఎగరొప్పుతూంటే, దత్ ఆమె పదధ్వని విని "ఎవరది? జమిలీ!" అన్నాడు. జమిలీ, "దత్! నువ్వు వెంటనే రావాలి. శరభుజోను పాము కరిచింది. ఆ పామును పైకి రప్పిస్తేనేగానీ శరభుజో బ్రతకడు. రా!" అంది. దత్ మరేమీ ప్రశ్నించలేదు. జమిలీ కోర్కె తీర్చడమే అతని ధ్యేయం. తన చేతిని ముందుకు చాచాడు. జమిలీ ఆ చేతిని అందుకొని ముందు పరుగెడుతూంది. దత్ ఆమెను అనుసరిస్తున్నాడు. జమిలీ దత్‌ను వెంట బెట్టుకొని రావడం చూచి గ్రామపెద్ద ప్రశ్నార్థకంగా నొసలు చిట్లించాడు. నజరికో కుమార్తెను "అత నెందుకు" అనడిగాడు. జమిలీ సమాధానం ఇవ్వలేదు. దత్ కలగజేసుకొని, "శరభుజోను బ్రతికించాలంటే ఆ పామును పైకి రప్పించాలా?" అ నడిగాడు. వైద్యుడు, "అవును. దాని కాటొక్కటే ఆ విషానికి విరుగుడుగా పని చేస్తుంది" అన్నాడు. "ఇప్పు డా పాము ఎక్కడుంది?" అని అడిగాడు దత్. "ఇక్కడే బొరియలో ఉంది" అన్నాడు గ్రామపెద్ద. దత్,జమిలీ సహాయంతో కొండచరియలోకి దిగాడు. మురళిని తీసి రాగాలాపన ప్రారంభించాడు. ఎత్తడమే అద్భుతమైన, సమ్మోహనకరమైన మోహనరాగాన్ని అందుకున్నాడు. హృదయాలు ద్రవించేటట్లు, శిలలు కరిగేటట్లు, ప్రకృతి పైమరచేటట్లు లోకసమ్మోహనకరంగా మురళీగానం చేయసాగాడు. చుట్టూ కొద్ది దూరంలో నిలబడిన ప్రజలు ఆ గానంలో లీనమై శిలల్లా నిలబడ్డారు. మురళీగానం అంతకంతకూ అత్యద్భుతస్థాయికి పోతూ, రాగశిఖరాగ్రాల్ని అందు కొంటూంది. ఒక్క మురళీగానస్వనం తప్ప అక్కడ మరొక శబ్దం వినిపించడం లేదు. నాగవైద్యుడు మాత్రం వెయ్యికళ్లతో బొరియను కనిపెడుతున్నాడు.

ఉన్నట్లుండి నాగవైద్యుడు ఉలిక్కిపడ్డాడు. అతని కళ్లు మెరిశాయి. కొండంతా తవ్వినా చిక్కుతుందా అనుకున్న సర్పం బయటికివచ్చింది. ఆరడుగుల పొడవు ఉన్న ఆ మహాసర్పం పడగ విప్పి దత్ ముందు పరవశంతో ఆడుతూంది. అది ఇప్పుడు ఎలాటి హానీచేయదని నిశ్చయించుకొని,దత్ శక్తికి విస్మయపడుతూ, అతనిని సమీపించి చెవిలో మెల్లిగా చెప్పాడు: "నావెంట రా." వైద్యుడు దత్ చేయిపట్టుకొని శరభుజో పడిఉన్న చోటుకు తీసుకొని వెళ్లాడు. వారిని వెంబడించి ఆ సర్పం కూడా వచ్చింది. వైద్యుడు, "నీ గానాన్ని ఆపకు" అని దత్‌ను హెచ్చరించి, సర్పాన్ని శరభుజో వద్దకు రానిచ్చి ఆగాడు. పడగ విప్పి ఆడుతున్న ఆ సర్పంపైకి పడేటట్లు శరభుజో చేతిని పైకెత్తి పడేశాడు వైద్యుడు. సర్పం బుస్సుమంటూ ఆ చేతిపై కాటువేసి, దత్‌వంక తిరిగింది. వైద్యుడు పడి చెయ్యకుండా శరభుజోను అక్కడినుండి దూరంగా తీసుకొని వెళ్లిపోయాడు. వైద్యుడు మందొకటితీసి శరభుజో నోట్లో పోశాడు. కాస్సేపటికి శరభుజోలో చలనం కలిగింది.

దత్‌కు పది గజాల దూరంలో అందరూ నిలబడ్డారు. అందరూ దత్‌వంక అతనిని రక్షించడ మెలాగా అని ఆత్రుతతో చూస్తున్నారు. దత్‌కు ఇదేమీ తెలియదు. అతడు తన మనసంతా మురళీగానంపైనే కేంద్రీకరించాడు. అతనికి జ్ఞాపకమున్న విషయాలు రెండే. జమిలీ కోరిన కోరిక, మురళీగానం. దత్‌కు ముచ్చెమటలు పోస్తున్నాయి. అతని శక్తిఅంతా మురళీగానం రూపంలోనూ, స్వేదరూపంలోనూ కరిగి బయటకు ప్రవహిస్తున్నట్లుందా దృశ్యం. దత్ తన యావచ్ఛక్తినీ వినియోగించేశాడు ఆనాడు. పడమట సంధ్యారాగం అలముకొంటూంది. దత్ శక్తి సన్నగిల్లుతూంది. స్వరాన్ని ఆరోహణలోంచి అవరోహణలోనికి దించాడు.

జమిలీ, "దత్!దత్! ఆపకు" అని కేకలు వేస్తూంది. శరభుజో అప్పుడే కోలుకొని లేచాడు. సర్పం ముందు నిలబడి మురళి వాయిస్తున్న దత్‌ను చూసి ఆశ్చర్యపడ్డాడు. జమిలీ అతనికి జరిగిన కథంతా చెప్పింది. శరభుజో హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. దత్‌ను ఆ సర్పం బారినుండి రక్షించాలని బల్లెమొకటి అందుకొని ముందు కడుగువేశాడు. కానీ అంతలోనే విషాదకరమైన సంఘటన జరిగిపోయింది. దత్ మురళీగానం ఆపేశాడు. అంతవరకూ పరవశంతో ఉన్న అసర్పం మేలుకొని, మహాక్రోధంతో,ఎదుట నిలబడ్డ దత్‌ను నాలుగు మార్లు కసిదీరా కాటువేసి బొరియలోనికి వెళ్లిపోయింది.

దత్ చేతిలోని మురళి మూగవోయి క్రింద జారి పడింది. దత్ కొండవాలును ఆధారంగా చేసుకొని నిలవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాడు. శరభుజో వెళ్లి దత్‌ను తన భుజంమీద వేసుకొని కొండవాలునుండి బయటకు తీసుకువచ్చాడు. దత్ పెదవులు వణికిపోతున్నాయి. "జమిలీ" అని పిలిచాడు. జమిలీ, దత్ చేతిని పట్టుకుంది. "జమిలీ! నేను చనిపోతున్నాను. ఇకనన్ను మరిచిపో. మీవంటి ఆప్తుల మధ్య మరణించగలగడం నా అదృష్టం. నాకు నా అన్నవారు లేరు. మీరు నన్ను మీలో ఒకడుగా ఇన్నిదినాలు ఆదరించారు. మీ అందరికీ నా తుది కృతజ్ఞత. జమిలీ! శరభుజో! మీ రిద్దరూ సౌభాగ్యంతో వెయ్యేళ్ళు వ..ర్ధి..ల్లం...డి.." ఇద్దరి చేతులూ అతిప్రయత్నంమీద కలిపి పెదవులమీది చిరునవ్వు అంతరించకమునుపే అంతరించాడు దత్. అక్కడున్న వారందరికీ కన్నీరు మున్నీరై పారుతూంది. హృదయవిదారకమైన దృశ్యం అది.

తరువాత దత్‌ను అక్కడే సమాధి చేశారు. ఆ సమాధిపైన చక్కని మందిర మొకటి వెలిసింది. అతడు చనిపోయిన దినాన ప్రతి సంవత్సరం అక్కడ ఉత్సవాలు జరుగుతాయి. ఎందరోఆమందిరానికివచ్చిమొక్కిపోతూఉంటారు. నూతన వధూవరులు ఆ మందిరానికివచ్చి తమకు శుభం కలగడంకోసం అక్కడ ప్రార్థించడం ఆచారమైంది. దత్ తన త్యాగంతో ఆ గ్రామంలోని నాగులకు ఆరాధ్యదేవుడయ్యాడు ★